# ఐదవ అధ్యాయము

www.doctorpaul.org

# వ్యసనాక్రాంతుడైన యేసు అడుగులలో నడుచుట

**మ**నము క్రీస్తును వెంబడించుచుండగా విలపించుచుండవలెనంటే కొంతమంది "ఇది కఠినమైన మాట, ఇది ఎవడు వినగలడ"ని (యోహాను 6:60) చెప్పుకొని అభ్యంతర పడవచ్చునేమో! యేసు "వ్యసనా క్రాంతుడును, వ్యాధి ననుభవించినవాడునై" యుండెనని యెషయా ప్రవచించెను (53:3). మనము లోతుగా ఆలోచించినట్లయితే వ్యసనాక్రాంతుడైన యేసు మాదిరి ప్రకారము నడుచుచుండగా మనముకూడా వ్యసనా క్రాంతులమై యుందుమని తెలిసికొందుము. దీనివలన మనకు సంతోషముండదని అనుకొనవద్దు. విలపించుట యెంత లోతైనదో, సంతోషించుట అంత యెత్తైయినది. విలపించకుండా సంతోషమును అనుభవించ లేము. యేసు తన జీవిత కాలములో మూడు సందర్భములలో సంతోషించినట్లు వ్రాయబడినది. (లూకా 10:21; యోహాను 15:11; 17:13). ఐదు సందర్భములలో యేసు విలపించినట్లో, కన్నీళ్ళు విడిచినట్లో వ్రాయబడినది. (మార్కు 3:5; 7:34; యోహాను 19:33–38; లూకా 19:41; మత్తయి 23:13–37; 26:38; హెబ్రీ 5:7).

యేసు సంతోషించిన సందర్భములను గూర్చి యిప్పుడు ఆలోచించ లేము గాని ఆయన విలపించిన సందర్భములను గూర్చి ఆలోచించ వలెనని మనవి చేస్తున్నాము. పరిసయ్యుల హృదయ కాఠిన్యమునకు దుఃఖపడి, కోపముతో వారిని కలియచూచెనని మార్కు తెలియజేసెను (3:5). ఆయన శిష్యులు ఆయన బోధ అర్థము చేసికొనలేక ఎన్నో సార్లు పొరపడిరి. ఆరోహణమైనంత వరకు వారు ఈ లోక సంబంధమైన రాజ్యముకొరకు ఆశ పడియుండిరి. (అపొ. 1:6). దానివలన యేసు దుఃఖపడి కోప పడెనని వ్రాయబడ లేదు. ఎందుకంటే వారి హృదయము పరిసయ్యులవలె కఠిన హృదయము కాదుగాని, చిన్నపిల్లల వంటి హృదయమాయెను. వారు నేర్చుకొనుటకు ప్రయత్నము చేస్తున్నారు. అయితే పరిసయ్యులు నేర్చుకొనుటకు ప్రయత్నము చేయుట లేదు. వారి హృదయ కాఠిన్యమునకు యేసు దుఃఖపడి వారిని కోపముతో చూచెను.

ప్రజలు చెవుడుగల నత్తివాని నొకని ఆయనయొద్దకు తోడుకొని వచ్చి, వాని మీద చేయి యుంచుమని ఆయనను వేడుకొనిరి. యేసు వాని చెవులలో తన వ్రేళ్ళు పెట్టి ఉమ్మివేసి వాని నాలుక ముట్టి ఆకాశమువైపు కన్నులెత్తి నిట్టూర్పు విడిచి ప్రార్థన

www.doctorpaul.org

చేయగా వాని నాలుక నరము సడలెను గనుక వాడు తేటగా మాటలాడెను. (మార్కు 7:31-35). యేసు ఒకని నిమిత్తమే అంత శ్రద్ధ పుచ్చుకొని నిట్టూర్పు విడిచి స్వస్థ పరచెనని అనుకొందుమా? ఒక స్థలమందు మాత్రము ఆయన శ్రద్ధపుచ్చుకొనిన విధము అంత వివరముగా వ్రాయబడెను. గాని యేసు ఎల్లప్పుడు రోగులను స్వస్థపర్చు నట్లుగా మార్కు మనకు ఒక ద్వారము తెరచి ఒకసారి వివరముగా వ్రాసెను. "ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెన"ని మత్తయి సాక్ష్యము ఇచ్చెను (8:17). గనుక యేసు మన రోగముల నిమిత్తము విలపించెనని తెలిసి కొంటున్నాము. రోగములు తీసివేయుట కుదుర్చుట యేసుకు యిష్టము.

తన స్నేహితుడైన లాజరు చనిపోయెనని తెలిసికొని యేసు ఆయనను లేపుటకు రాగా ఆయన బంధుమిత్రాదుల ఏడ్పు చూచి యేసు కలవరపడి ఆత్మలో మూలిగెను. మన బైబిలంతటిలో అన్నిటికంటే చిన్న వాక్యము ఈ సందర్భములో వ్రాయబడెను. అదేదనగా, యేసు కన్నీళ్ళు విడిచెను (యోహాను 11:35) అనునది. యేసు సమాధి దగ్గర మరల తనలో మూలిగెను. దీనిని బట్టి చూస్తే ఆదాము మొదలుకొని యుగ సమాప్తి పర్యంతము పాపము వలన కలుగు మరణమును గూర్చి యేసు జ్ఞాపకము చేసుకొంటు కన్నీళ్ళు విడిచెనని గుర్తెరుగుచున్నాము.

తన ఆఖరు వారములో జయప్రవేశములో యెరూషలేమును సమీపించినప్పుడు ఒలీవల కొండనుండి యేసు దానిని చూచి దాని విషయమై ఏడ్చి - "నీవును ఈ నీ దినమందైనను సమాధానసంబంధమైన సంగతులను తెలిసికొనినయెడల నీకెంతో మేలు; గాని యిప్పుడవి నీ కన్నులకు మరుగు చేయబడియున్నవి" అని విలపించెను (లూకా 19:41-43). ఆయన పట్టణములో విజయముతో ప్రవేశించి దేవాలయము శుభ్రపరచిన తరువాత ఒకనాడు తనను అంగీకరింపని పరిసయ్యుల విషయమై "అయ్యో, అయ్యో" అని ఏడు సార్లు యేసు విలపించెను. (మత్తయి 23:13.36). వారి విషయమై విలపించిన తరువాత "యెరూషలేమా, యెరూషలేమా, ప్రవక్తలను చంపుచును నీ యొద్దకు పంపబడినవారిని రాళ్ళతో కొట్టుచును ఉండుదానా, కోడి తన పిల్లలను రెక్కల క్రింద కేలాగు చేర్చుకొనునో ఆలాగే నేనును నీ పిల్లలను ఎన్నోమారులు చేర్చుకొనవలెనని యుంటిని గాని మీరు ఒల్లక పోతిరి. ఇదిగో మీ ఇల్లు మీకు విడువబడి యున్నది" అని యేసు వ్యసనాక్రాంతుడై విలపించెను (మత్తయి 23:37-38). గనుక నశించిపోవుచున్న వారి విషయమై యేసు కన్నీళ్ళు విడిచెనని స్పష్టమగుచున్నది.

గెత్సేమనే తోటలో యేసు పొందిన శ్రమ విషయము మనమెట్లా చెప్పగలము? మనకు మాటలు చాలవు. "ఆయన వేదనపడి మరింత అతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట నేల పడుచున్న గొప్ప రక్తబిందువులవలె ఆయెను" (లూకా 22:44).

www.doctorpaul.org
“మహా రోదనతోను కన్నీళ్ళతోను, తన్ను మరణమునుండి రక్షింపగలవానికి ప్రార్థనలను యాచనలను” యేసు సమర్పించెనని మరి యొకడు సాక్ష్యము ఇచ్చెను (హెబ్రీ. 5:7). ఆయన కన్నీళ్ళు విడిచి చేసిన ప్రార్థన యొక్క లోతైన భావము కొంతవరకు ఆలోచించు దుము గాక! మరణమునుండి తన్ను రక్షింపగల వానికి ప్రార్థన చేసెను గనుక తాను మరణించకుండ యుండవలెనని ప్రార్థన చేసినట్లుగా నున్నది. భయభక్తులు కలిగి యున్నందున ఆయన అంగీకరింపబడెను (హెబ్రీ. 5:7). ఆయన ప్రార్థన అంగీకరింప బడినందు వలన ఆయన మరణించకుండా యుండెనని భావము వస్తుంది. మరుసటి మధ్యాహ్నము చనిపోయెను. ఇది ఎట్లా? ఇది యొక చిక్కుగదా? అంతే కాదు. ఆయన ఏ మరణమునుండి రక్షింపబడవలెనని ప్రార్థనచేసెను? సిలువ మరణము నుండియా? కాదు. దాని కొరకే తన ఐశ్వర్యమంతా విడిచి ఈ పాప లోకమునకు దిగివచ్చెను. విమోచన పని చేయకుండా పాపులకొరకు మరణించకుండా తాను జీవించవలెనని ఆయన ప్రార్థించలేదు. గాని తన వేదనను బట్టి ఆ రాత్రిలో అక్కడనే తాను చచ్చిపోవచ్చు నేమోయని ఆ మరణమునుండి తన తండ్రి తనను రక్షించి తాను మరుసటి మధ్యా హ్నము సిలువ మీద మరణించి విమోచన క్రయధనమును ముగించునట్లుగా ప్రార్థిం చెను. దీనిని బట్టి చూస్తే పాపులను రక్షించుటకును తాను చేయవలసిన ప్రాయశ్చిత్తార్థ మైన బలిని సంపూర్ణముగా నెరవేర్చుటకును యేసుకెంత అభిలాష కలిగినదో మనము చూడగలము. ఆయన మహారోదనముతోను కన్నీళ్ళతోను తన సిలువయొద్దకు వచ్చెను. వ్యసనాక్రాంతుడును, వ్యాధి ననుభవించినవాడునైన యేసు అడుగులలో మనము నడుచుదుముగాక.

బైబిలులో గొప్ప గొప్ప బోధకులు మహా దైవసేవకులు కన్నీళ్ళు విడుచుచు తమ సేవ చేసినారు. యూదులు బబులోను చెరలో కొనిపోబడకమునుపే 500 సం॥ల నుండి వారి పితరులును, వారి తాత ముత్తాతలును వారు చేసిన పాపములు వారిని పట్టనైయుండగా యిర్మీయా ప్రవచించ బద్ధుడైనాడు. వారి దేశమంతా నాశనమై పోతుందని యిర్మీయాకు తెలిసిపోయినది. ఆఖరు రోజులలో యెహోవా యూదావారికి చేయనుద్దేశించిన కీడంతటిని గూర్చి వారు విని దేవుడు వారి దోషమును వారి పాప మును క్షమించునట్లు తమ దుర్మార్గతను విడిచి పశ్చాత్తాప పడుదురేమో యని యెహోవా దేవుడు వారిని మందలించుటకు యిర్మీయాను పంపెను. యిర్మీయా కొన్ని ఏండ్లు సేవచేసిన తరువాత “కోత కాలము గతించియున్నది: గ్రీష్మకాలము జరిగిపోయెను, మనము రక్షణ నొందకయే యున్నాము. నా జనుల వేదననుబట్టి నేను వేదనపడు చున్నాను, వ్యాకులపడుచున్నాను, ఘోరభయము నన్ను పట్టియున్నది … నా జనులలో హతమైనవారిని గూర్చి నేను దివారాత్రము కన్నీరు విడుచునట్లు నా తల జలమయము

www.doctorpaul.org
గాను, నా కన్ను కన్నీళ్ళ ఊటగాను ఉండునుగాక" అని విలపించెను (యిర్మీయా 8:20; 9:1). మీ జనులలో హతమైన వారిని గూర్చి మీరెంత కన్నీళ్ళు విడిచినారు? యిర్మీయా తన స్వలాభముకొరకు కన్నీళ్ళు విడువలేదుగాని తన ప్రజల రక్షణ నిమిత్తము కన్నీళ్ళు విడిచెను. ఒక సందర్భమందు యెహోవా యొక్క ఆజ్ఞ యిర్మీయా తన ప్రజలకు తెలియ జేయగా వారాయనను విసర్జించిరి. యిర్మీయా నోటి వెంబడి వచ్చిన జవాబులో ఎంత వేదనయున్నదో మనము గమనించెదము. అదేదనగా, "మీరు ఆ మాట విన నొల్లని యెడల మీ గర్వమునుబట్టి నేను చాటున ఏడ్చుదును, యెహోవా మంద చెరపట్టబడినందున నా నేత్రము బహుగా వలపోయుచు, కన్నీరు విడుచుచు నుండును" (యిర్మీయా 13:17). కరువు కాలములో ప్రధానులు బీదవారిని నీళ్ళకు పంపుచుండగా వారు చెరువుల యొద్దకు రాగా నీళ్ళు దొరకలేదు. వట్టి కుండలు తీసుకొని వారు మరలి వచ్చిరి. సిగ్గును అవమానమును నొందినవారై తమ తలలు కప్పుకొన్నారు. దేశములో వర్షము కురువక పోయినందున నేల చీలి యుండినది. గనుక సేద్యము చేయువారు సిగ్గుపడి తలలు కప్పుకొన్నారు (యిర్మీయా 14:3,4). అప్పుడు యిర్మీయా "యెహోవా' మా తిరుగుబాటులు అనేకములు; నీకు విరోధముగా మేము పాపము చేసితిమి; మా దోషములు మా మీద దోషారోపణ చేయుచున్నవి" అని తన ప్రజల పాపములు ఒప్పుకొని "నా జనుల కన్యక గొప్ప ఉపద్రవము వలన పీడింపబడుచున్నది. ఘోరమైన గాయము నొందియున్నది; దివారాత్రము మానక నా కన్నులనుండి కన్నీరు కారు చున్నది" అని విలపించెను (యిర్మీయా 14:7,17). యిర్మీయా తన ప్రజల పాపములు ఒప్పుకొంటూ తననుకూడా వారిలో ఒకనిగా కలుపుకొన్నాడు. "వారి" పాపములు అన కుండ "మా" పాపములు అని చెప్పెను. యిర్మీయావలె మీరు ఎంత కన్నీళ్ళు విడిచినారు?

1870 వ సంవత్సరమునకు ముందు 30 యేండ్లనుండి జువెట్ దొరగారు మన ఆంధ్రదేశములో పనిచేయుచు ఉజ్జీవము కొరకు ప్రార్థించుచు కన్నీళ్ళు విడుచుచు వచ్చిరి. ఒక రాత్రియంత ఆయనయు కొంతమంది భారత క్రైస్తవులును ఒంగోలు దగ్గర ఒక కొండ మీద కూడి కన్నీళ్ళతో ప్రార్థించిరి. తెల్లవారుజాము అయ్యేటప్పటికి దేవుడు వారి ప్రార్థనాలకించెనని తెలిసికొనిరి. "కన్నీళ్ళు విడుచుచు విత్తువారు సంతోష గానముతో పంట కోసెదరు. విత్తువాడు పిడికెడు విత్తనములు చేతపట్టుకొని యేడ్చుచు పోవును. అయితే అతడు సంతోష గానము చేయుచు పనలు మోసికొనివచ్చును" (కీర్తన 126:5,6) అను వాక్యము వారి జీవితానుభవములో అక్షరార్థముగా నెరవేరినది. జువెట్ దొరగారు చనిపోక మునుపు – "నేను ఆంధ్రదేశమంతా తిరిగి యేసు ప్రేమను గూర్చి ప్రకటించుటకు వచ్చితిని. నేను మరియొకసారి యిట్లు చేయుటకు తరుణము దొరికినట్లయితే మరి యెక్కువ కన్నీళ్ళు విడుచుచు చేసియుందును" అని సాక్ష్యమిచ్చెను.

www.doctorpaul.org
ఆయన కన్నీళ్ళవలన గొప్ప ఫలితము 1878 సంవత్సరమున కలిగినది. ఆ సంవత్సరమున ఒకనాడే 2222 మంది గుండ్లమ్మ నదిలో బాప్తీస్మము తీసికొన్నందున రెండవ పెంతెకోస్తు అయినదని చాలమంది చెప్పుదురు. ఆ రోజు సువార్త దీవెనలు పొందిన వారి బంధుమిత్రాదులును ముఖ్యముగా నేటి వరకు దీవింపబడియున్నారు. గాని యీ రోజులలో సువార్త దీవెనలు వారిలో నుండి బయట వారికిని యితర కులస్థులకును పొర్లిపోవునట్లు వారిలో కన్నీళ్ళు విడుచుచు యితరుల రక్షణ నిమిత్తము మనోవేదన కలిగినవారు కావలెను. "సీయోనునకు ప్రసవవేదన కలుగగానే ఆమె బిడ్డలను కనెను" (యెషయా 66:8) అను వాక్యముతో ఆత్మీయమైన ప్రసవ వేదన విషయము ప్రవక్త చెప్పుచున్నాడు. అపొస్తలుడైన పౌలు చూపించిన మాదిరి ననుసరించి ఇతరుల రక్షణ విషయము మీకు ఎంత ప్రసవవేదన కలిగినది? (గలతీ 4:19).

యెహోవా యూదులను చేపట్టి తనకు స్వకీయ జనముగా నుండుటకై, యినుప కొలిమివంటి ఐగుప్తు బానిసత్వములో నుండి మోషే ద్వారా రప్పింపగా, వారు సీనాయి పర్వతము దగ్గరకు వచ్చిరి. మోషే వారిని అక్కడ విడిచిపెట్టి దేవుని దగ్గరనుండి ఆజ్ఞలు తీసుకొని వచ్చుటకై పర్వతము మీద కెక్కిపోయెను. ఆయన త్వరగా వస్తాడని వారనుకొనిరి. ఆయన తిరిగి రాక ఒక వారము గతించిపోయెను. వారు కనిపెట్టుచున్నారు. ఆయన తిరిగి రాక ఆరు వారములు అయినవి. వారు కనిపెట్టి విసుకుపడిరి. ఆఖరుకు ఒక బంగారు దూడను చేసి దానిని తమ దేవునిగా ఆరాధించిరి. మోషే క్రిందికి వచ్చినప్పుడు దానిని చూచి కోపపడి తన చేతులలోని దేవుని పది ఆజ్ఞలుగల రెండు రాతి పలకలను పగల గొట్టెను. ఇంకా దానితో ఆయన కోపము చల్లారిపోలేదు గాని, ఆ ప్రజలలో మూడు వేలమందిని చంపించెను. "మరునాడు మోషే ప్రజలతో – మీరు గొప్ప పాపము చేసితిరి గనుక యెహోవా యొద్దకు కొండ యెక్కి వెళ్ళెదను; ఒకవేళ మీ పాపమునకు ప్రాయశ్చిత్తము చేయగలనేమో అనెను. అప్పుడు మోషే యెహోవా యొద్దకు తిరిగి వెళ్ళి – అయ్యో, యీ ప్రజలు గొప్ప పాపముచేసిరి; వారు బంగారు దేవతను తమకొరకు చేసికొనిరి. అయ్యో, నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా సరే, లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములో నుండి నా పేరు తుడిచివేయుమ"ని బతిమాలుకొనెను (నిర్గ. 32:30–32). అయ్యో నీవు పాపమును క్షమించితే క్షమించుము, లేనియెడల నీవు వ్రాసిన గ్రంథములోనుండి నా పేరు తుడిచివేయుమనిన మోషేను, మన మాదిరికొరకు తీసికొందుమా? మీరు అలాంటి ప్రార్థన ఎప్పుడైనా చేసితిరా? ప్రజల రక్షణ నిమిత్తము మీకెప్పుడైన అంత వేదన కలిగినదా? మోషే ఈలాంటి వేదన కలిగి ప్రార్థన చేసిన తరువాత దేవుని సన్నిధినుండి దిగివస్తుండగా ఆయన ముఖము చూడలేని కాంతితో ప్రకాశిస్తుండినది. ప్రజలు ఆయన ముఖమును తేరి

www.doctorpaul.org
చూడలేకపోయిరి (నిర్గ. 34:19-35). మోషే పది ఆజ్ఞలుగల రాతి పలకలు దేవుని దగ్గర పొంది, తీసుకొని వచ్చినప్పుడు, ఆయన ముఖము ప్రకాశించలేదు. గాని "నీవు వారి పాపమును ఒకవేళ పరిహరించితివా సరే, లేనియెడల నీవు వ్రాసిన నీ గ్రంథములో నుండి నా పేరు తుడిచివేయు"మని మహావేదనతో తన్నుతాను మధ్యవర్తిగా నుండి ప్రాయశ్చిత్తము చేసిన తరువాతనే ఆయన ముఖము ప్రకాశించినది.

అటుపిమ్మట రెండేండ్లయిన తరువాత వేగులవారు వాగ్దత్తము చేయబడిన దేశమును వేగు చూచి వచ్చి తమ అధైర్యపరిచే సమాచారము అందించిన తరువాత ఆ సర్వసమాజము ఎలుగెత్తి కేకలు వేసి మోషేమీద సణుగుకొనెను. ఆ ప్రజలు ఆ రాత్రి అంతా ఏడ్చి – అయ్యో, ఐగుప్తులో మేమేల చావలేదు అని మోషేను అహరోనును నిందించిరి. దీనివలన దేవుడు కోపపడి – "ఎన్నాళ్ళవరకు ఈ ప్రజలు నన్ను అలక్ష్యము చేయుదురు? ఎన్నాళ్ళవరకు నేను వారి మధ్యను చేసిన సూచకక్రియలన్నిటిని చూచి నన్ను నమ్మకయుందురు? నేను వారికి స్వాస్థ్యమియ్యక తెగులుచేత వారిని హతముచేసి, ఈ జనముకంటే మహాబలముగల గొప్ప జనమును నీ వలన పుట్టించెదనని" మోషేతో చెప్పెను (సంఖ్యా. 14:11,12). అందుకు మోషే మరియొకసారి మధ్యవర్తిగా నుండి వారిని రక్షించెను. దేవుడు ఆ ప్రజలను హతము చేసి ఆ ప్రజలకంటె మహాబలముగల గొప్ప ప్రజలను తనవలన పుట్టించెదనని వాగ్దానము చేసినప్పుడు, మోషే దానికి ఆశపడక మధ్యవర్తిగా నుండి ఆ ప్రజలను రక్షించినందువలన మరి యెక్కువ కీర్తి కలుగలేదా? అవును, కలిగినది.

క్రొత్త నిబంధనలో మోషేవంటి వాడొకడు కలడు. అపొస్తులుడైన పౌలు – "నాకు బహు దుఃఖము కలిగియున్నది. నా హృదయములో మానని వేదన యున్నది. క్రీస్తునందు నిజము చెప్పుచున్నాను, అబద్ధమాడుట లేదు. పరిశుద్ధాత్మయందు నా మనస్సాక్షి నాతోకూడా సాక్ష్యమిచ్చుచున్నాడు. సాధ్యమైన యెడల, దేవసంబంధులైన నా సహోదరుల కొరకు నేను క్రీస్తునుండి వేరై శాపగ్రస్తుడనై నుండగోరుదును" అని విలపించెను. (రోమా 9:1-3).

సాధ్యమైనయెడల తన ప్రజలకొరకు శాపగ్రస్తుడై యుండగోరెను. సాధ్యము కాదు గాని సాధ్యమైనయెడల శాపగ్రస్తుడై తన ప్రజలను రక్షించవలెనని పౌలు వేదనపడెను. మీకు అలాంటి వేదన ఉన్నదా? ఉండవలెనని కోరుచున్నారా? మోషే పౌలులు వీరిద్దరు తమ ప్రజలను ప్రేమించి పరలోకమందు తమకొరకు ఉంచబడిన ఆ గొప్ప నివాసస్థలము యొక్క విలువను, తమ ప్రజలయొక్క విలువను అను ఈ రెంటిని త్రాసులో తూకమేసి పరలోకమందు తమ కొరకు ఉంచబడిన ఆ గొప్ప నివాసస్థలము

www.doctorpaul.org

యొక్క విలువ తమకంటే ప్రజలయొక్క విలువ గొప్పదని ఎంచి యిట్లు ప్రార్థించిరి. వారి ఉన్నత జీవితమునకు ఇది గొప్ప రహస్యమని నాకు తోచుచున్నది.

పౌలు ఎఫెసీలో ఒక సంఘము స్థాపించిన తరువాత ఒకనాడు పడవమీద వారికి సమీపముగా పోతూ ఆ సంఘపెద్దలను తన దగ్గరకు రప్పించెను. వారి మధ్య తాను చేసిన సేవ విషయము జ్ఞాపకము చేస్తుండగా "యూదుల కుట్రలవలన నాకు శోధనలు సంభవించినను, కన్నీళ్ళు విడుచుచు పూర్ణమైన వినయభావముతో నేనేలాగున ప్రభువును సేవించుచుంటినో మీకే తెలియును" అని జ్ఞప్తికి తెచ్చెను (అపో. 20:19). వెంటనే ఆ ప్రసంగములోనే "నేను మూడు సంవత్సరములు రాత్రింబగళ్లు కన్నీళ్ళు విడుచుచు ప్రతి మనుష్యునికి మానక బుద్ధి చెప్పితినని మీరు జ్ఞాపకము చేసుకొని మెలకువగా ఉండుడి" అని వారిని హెచ్చరించెను (అపో. 20:31). గొప్ప దృశ్యమిది! ఆ గొప్ప అపొస్తలుడు ఇంటింట తిరుగుచు బుద్ధి చెప్పెను. ఇంటింట తిరుగుట మాత్రము కాదు. బుద్ధి చెప్పుట మాత్రము కాదు. కన్నీళ్ళు విడుచుచు ఇంటింట తిరిగెను. కన్నీళ్ళు విడుచుచు బుద్ధి చెప్పెను. ఆయన గొప్ప జీవితము యొక్క రహస్యము ఇక్కడ కనబడుచున్నది.

పౌలు ఫిలిప్పీయులకు వ్రాస్తూ "అనేకులు క్రీస్తు సిలువకు శత్రువులుగా నడుచు కొనుచున్నారు; వీరిని గూర్చి మీతో అనేక పర్యాయములు చెప్పి యిప్పుడును ఏడ్చుచు చెప్పుచున్నాను. నాశనమే వారి అంతము, వారి కడుపే వారికి దేవుడు; వారు తాము సిగ్గుపడవలసిన సంగతులయందు అతిశయపడుచున్నారు" అని వారిని హెచ్చరించెను (ఫిలిప్పీ 3:18-19). "కన్నీళ్ళు విడుచుచు" లేక "ఏడ్చుచు" పౌలు నశించుచున్నవారి విషయము హెచ్చరించుటలో ఆయన గొప్ప సేవయొక్క ఫలితమునకుగల రహస్యము బయలుపరచెనని నాకు తోచుచున్నది. ఒకానొకప్పుడు అమెరికా దేశములో ఒక సంఘమునకు పాస్టరు లేకుండా పోయెను. ఒక ఆదివారమున ఒకడు వచ్చి "పాపము వలన వచ్చు జీతము మరణము" అను వాక్యముపై బోధించెను ... మరుసటి ఆదివార మున మరియొకడు వచ్చి అదే వాక్యముపై బోధించెను. సంఘము మొదటి బోధకుని పిలువకుండా రెండవ బోధకుని పిలిచి నియమించిన తరువాత ఒకనాడొకడు ఆ సంఘ పెద్దలను ఒక విషయము నాకు విశదపరచుమని అడిగెను. "ఆ యిద్దరు బోధకులు ఒకే వాక్యముపై బోధించిరి. వారి సిద్ధాంతము ఒకటే. ఆ మొదటి మనిషిని పిలువకుండా రెండవ మనిషిని ఎందుకు పిలిచినార"ని అడిగెను. అందుకు ఆ మని షితో ఆ సంఘపెద్దలు – "మొదటివాడు, పాపాత్ములు నరకానికి పోతే ఆయనకు పర్వాలేదన్నట్లుగా బోధించెను. కాని రెండవవాడు పాపాత్ములు నరకానికి పోతున్నందు వలన తనకు వేదన కలిగినట్లుగా బోధించెను. గనుకనే రెండవ బోధకుని పిలిచి నామ"ని జవాబిచ్చిరి.

www.doctorpaul.org
మిలటరీ వారికి బలిష్టులు కావలెను. లోకరాజ్యములు స్థాపించుటకు బలత్కారము కావలెను. గాని యేసు సేవకొరకు విలపించ గలిగినవారు కావలెను. దేవుని రాజ్యము స్థాపించుటకు కన్నీళ్ళు కావలెను. మనకు ముందర పోవుచున్న యేసుప్రభువు వ్యసనా క్రాంతుడును వ్యాధి ననుభవించినవాడునై యున్నాడు. ఆయనను వెంబడింపగోరెదవా? ప్రజల రక్షణ నిమిత్తము మనోవేదన కలిగియున్నావా? ఇప్పటి వరకు మనము చూచిన వారందరు తమ ప్రజల పాపముల విషయములో కన్నీళ్ళు విడిచిరి.

ఇప్పుడు మరియొక విధముగా ఆలోచించి ఒకడు తన స్వంత పాపముల విషయ ములో కన్నీళ్ళు విడుచుట యుక్తమని గమనించ బోతున్నాము. యేసు యొద్దకు వచ్చిన పాపాత్ములు కన్నీళ్ళు విడుచుట యుక్తమని గమనించ బోతున్నాము. యేసు యొద్దకు వచ్చిన పాపాత్ములు కన్నీళ్ళు విడిచిరి. లూకా 7:36-50 లో నీతి పరుడగు పరిసయ్యుని యింటిలోని యొక పాపాత్మురాలిని గురించియు, యిద్దరు ఋణస్థుల ఉపమానమును గురించియు నేర్చుకొందుము. ఇది లూకా సువార్తలో మాత్రము కనబడును. పాపాత్ము రాలై పశ్చాత్తాపపడిన యీ స్త్రీకిని, పరిసయ్యుడైన సీమోనుకును అనేక ముఖ్య విషయము లలో విరుద్ధ గుణలక్షణము లుండును. సీమోను అందరు యెరిగినవాడు, మర్యాద పొందినవాడు, బహుశః భాగ్యవంతుడు. ఆ స్త్రీ పేరు వ్రాయబడలేదు, అవమానిత, కులహీనురాలు. సీమోను విందు చేయుచున్నాడు. అతిథి సత్కారము చేయువాడు సంతోషించుచున్నాడు. స్త్రీ ఉపవసించుచున్నది, ఏడ్చుచున్నది, మనస్సు విరిగియున్నది. సీమోను తన్ను తాను తృప్తిపరచుకొని యున్నాడు. తనకు సమృద్ధి కలిగియున్నది, మూర్ఖుడు. స్త్రీ అక్కరలు తీరకయున్నవి. అసహాయురాలై ప్రలాపించుచున్నది. సీమోను యేసు పాదములకు నీళ్ళిచ్చుటకు నీళ్ళులేవు. స్త్రీకి ప్రశ్చాత్తాపపు కన్నీళ్ళున్నవి. యేసు చెంపలకు ముద్దిచ్చుటకు సీమోనుకు ముద్దులేదు. యేసు పాదములు ముద్దు పెట్టుకొను టకు స్త్రీ చాలించలేదు. సీమోనుకు యేసు తలకు రాయుటకు నూనె లేదు. స్త్రీ యేసు పాదముల కర్పించుటకు అత్తరున్నది. సంగ్రహించి యిట్లు చెప్పవచ్చును. సీమోనుకు యేసు మీద ప్రేమ లేదు; స్త్రీ "యెక్కువగా" ప్రేమించెను. సీమోను స్త్రీ మీద నేరము మోపుట మాత్రమేగాక, యేసునందు తప్పు పట్టుకొనుచున్నాడు. స్త్రీ తన్ను తాను నిందించుకొనుచు, తన సొంత అతిక్రమములను గూర్చి విలపించుచు, తన హృదయ పూర్వకమైన దుఃఖమును క్రుమ్మరించుచున్నది.

పాపములో హెచ్చుతగ్గుల తరగతులున్నవని మనమనుకొందుము గాని హృదయ రహస్యముల నెరిగిన ఆయనకు - "ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా 3:23) అని తెలి యును. మన ప్రభువు చెప్పిన ఉపమానము ననుసరించి, 500 రూపాయలు అప్పున్న

www.doctorpaul.org
వాని పాపముతో 50 రూపాయలు అప్పున్నవాని పాపమును పోల్చితిమేని నిరాక్షేపముగా వారిరువురి పాపము ఒక విధముగా సమానమే. తన యజమానుని ఋణము తీర్చుటకు, వారిలో ఎవని యొద్దను ఏమియు లేదు. తమ యజమానుడు తమ్మును కనికరించి పూర్తిగా క్షమించితేనే తప్ప, అసహాయత్వమందు వారిరువురును సమానులే: అయినప్పటికి మిక్కిలి యథార్థమైనట్టియు, మహా ప్రాముఖ్యమైనట్టియు, భేదము వారిద్దరి ప్రేమలోను, విశ్వాస్యతలోను ఉన్నది. సీమోను తన యథార్థస్థితి విషయమై యుండినందున పాపుల రక్షకుని ఏమైన అడుగుటకు గాని ఏమైన పొందుటకు గాని యతని కవసరత కన్పించ లేదు. ఆహా! ఆ స్త్రీ యంటిమా! ఆమె పశ్చాత్తాప్తురాలైనందున పలుకుటకు యలవిగాని గొప్ప వరమును – "నీ పాపములు క్షమింపబడియున్నవి. నీ విశ్వాసము నిన్ను రక్షించెను; సమాధానముగల దానవై వెళ్ళుము" యనెడు మూడు కృపా వాక్యములను వరమును పొందినది. ఈ స్త్రీ ఆయన వెనుక పాదముల తట్టున ఏడ్చుచు నిలిచియుండెను (లూకా 7:38). యేసు బల్లమీద పండుకొని బల్ల వెనుక తట్టుకు చాపబడిన పాదములు వ్రేలాడుచుండగా, ఈ దీనురాలైన స్త్రీ ఆయన పాదముల యొద్ద నిలుచుండెను.

ఆ స్త్రీ ముందుగా నుద్దేశించి, ఆ యుద్దేశము చొప్పున తన కన్నీటితో ఆయన పాదములు తుడువ లేదు. ఆమె ఏడ్వవలెనని యనుకొనినట్టు కన్పించ లేదు. కాని ఆమె ప్రభువు సన్నిధియందు నిలుచుండగానే తాను ఆపుకొన జాలనంత దుఃఖము పొరలుకొని వచ్చెను. తన ఏడ్పు నిలుపుకొనజాలక పోయెను. కావున తన కన్నీళ్ళు తుడుచుకొనుచుండెను. ఆమె తల వెండ్రుకలు గాలికి చెదిరి ఎగురుచుండెను. అట్లు ఎగుర నిచ్చుట సిగ్గుకరముగా ఎంచబడినది. పాపమామె ఏమి చేయగలదు?

ఈ పాపాత్మురాలి కథ చాలా ప్రియమైనదిగాను యందమైనదిగా నున్నది. కాని దీనికంటె నాకు మరీ ప్రియమైన కథ కలదు. నిజముగా దేవుని వాక్యమంతటిలో పేతురు కథ నాకు చాల ప్రియమైనదిగాను యందమైనదిగాను ఉన్నది. పేతురు యేసు ప్రభువును ఎరుగనంటూ కండ్లెర్రజేసికొని కోపపడుతు నుండు సందర్భమందు తన స్నేహితుడగు యోహాను తనకు తోడైయుండెను. కాని యోహాను వలన పేతురు చింతపడ లేదు. యోహానును చూచి వినినంతమాత్రాన పేతురుకు పశ్చాత్తాపము కలుగ లేదు (యోహాను 18:15-18). కాని పేతురు ముమ్మారు బొంకిన తరువాత యతడింకా మాట్లాడుచుండగా వెంటనే "కోడికూసెను" – యప్పుడు ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను, గనుక పేతురు ... ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసుకొని వెలుపలికిపోయి సంతాపపడి ఏడ్చెను" (లూకా 22:61). నోటి వెంబడి ఏ మాట రాలేదు. ప్రభువు తిరిగి పేతురువైపు చూచెను, పేతురు జ్ఞాపకము చేసికొనెను.

www.doctorpaul.org
ఆయనకు కలిగిన దుఃఖము వర్ణించలేనిది. ఆయన కన్నీళ్ళు లెక్కింపలేనివి. నా స్నేహితులు దీని విషయము తెలిసికొని నన్ను యెగతాళి చేయుదురని పేతురు అనుకోలేదు. దీనివలన శిక్ష కలుగునని పేతురనుకో లేదు. కాని పరిశుద్ధుడును శాంతిపరుడును ప్రేమా స్వరూపియునైన నా యేసు ప్రభువును భంగపరిచినానని తనలో గుర్తెరిగి సంతాపపడి ఏడ్చెను. ఇలాంటి సంతాపమునకు క్షమాపణ దొరుకుతుందా? ఇలాంటి కన్నీళ్ళకు ఏ జవాబు దొరుకుతుంది? యేసుప్రభువు లేచిన వెంటనే శిష్యులకు కబురు చేసెను. కాని పైగా పేతురుకొరకు ప్రత్యేకముగా కబురంపెను (మార్కు 16:7). పేతురుకు ప్రత్యేకముగా యేసు ప్రత్యక్షమాయెను (లూకా 24:34).

మన అనుభవములో దుఃఖము, సంతోషము అను ఈ రెండు ఏకీభవించి యుండవలెను. దుఃఖము లేకుండ సంతోషము రాదు. రక్షణానంద మనుభవించకుండ యుండుట కొక కారణము కలదు. ఒకడు తన పాపముల నిమిత్తము దుఃఖపడకుండ రక్షణానంద మనుభవించలేడు. ఒకడు తన పాపముల నిమిత్తమెంత లోతుగా దుఃఖిస్తాడో అంత యెక్కువగా తన రక్షణ నిమిత్తము సంతోషిస్తాడు. యాకోబు తన అన్న దగ్గరనుండి కుయుక్తిగా స్వాస్థ్యము సంపాదించి తన యింటి దగ్గరనుండి తరిమి వేయబడి, అనేక రోజులైన తరువాత మరల తన అన్నను సమీపింపగా ఆయనకు వణకు పుట్టినది. ఒక రాత్రియంత దేవుని దూతతో పెనుగులాడి – నన్ను దీవించు! నన్ను దీవించు! నీవు నన్ను దీవించువరకు నిన్ను విడువను అని ప్రార్థించెను (ఆది. 32:22-32). అతడు కుయుక్తితో పన్నిన ఉపాయము యప్పుడాయనను పట్టుకొనెను. ఇంతవరకు నిజమైన పశ్చాత్తాపము, దైవచిత్తానుసారమైన దుఃఖమతనికి గలుగ లేదు. ఇంతకుముందు దేవుని చిత్తము త్వరత్వరగా నెరవేర్చుటకు కుట్రపన్నెను. ఇప్పుడదంత విసర్జించి దేవునిపై తన భారమువేసి తన యన్నను కలిసికొనుటకు సిద్ధముగా నున్నాడు. హోషేయ యీయన ప్రార్థన విషయమైన రహస్యము మనకు తెల్పుచున్నాడు. యేమనగా "అతడు దూతతో పోరాడి జయమొందెను. అతడు కన్నీరు విడిచి దేవుని బ్రతిమాలగా బేతేలులో ఆయన అతనికి ప్రత్యక్షమాయెను." (హోషేయ 12:4).

క్లౌ దొరగారు యెరుగుంట్ల పేరయ్య పిలుపు విని కనిగిరి తాలూకాలో పేరయ్యగారి చిన్న గ్రామమైన తలగుంట్లపాడు దర్శించినప్పుడు 30 మంది ఆయన రాకకొరకు వేచియుండిరి. క్లౌ దొరగారు యేసుప్రభువును గూర్చి వివరించుచు యెప్పుడైతే యేసు సిలువను గూర్చి చెప్పినారో యప్పుడే ఆ యావత్తు 30 మంది వెక్కి వెక్కి యేడ్చిరి. ఈ రోజులలో యెన్నిసార్లు చెప్పితే యెవరికి అలాంటి కన్నీళ్ళు వచ్చును? మనము ఏ స్థితిలో నున్నాము? యేసుప్రభువు శ్రమలనుగూర్చి వినినప్పుడు మన పాపముల వలన యేసుప్రభువు గాయపరచబడి రక్తము కార్చెనని వినినప్పుడు మన పాపముల

www.doctorpaul.org
విషయమై ఏడుస్తున్నామా? “ఇప్పుడు యేడ్చుచున్న మీరు ధన్యులు, మీరు నవ్వుదురు” (లూకా 6:21). “దుఃఖపడువారు ధన్యులు, వారు ఓదార్చబడుదురు” (మత్తయి 5:4). ఈలాటి నవ్వు మీకున్నదా? ఈలాటి ఓదార్పు మీకు దొరికిందా? కష్టముల వలన దుఃఖపడుట మామూలైనది. అన్నానికి, వస్త్రానికి కన్నీళ్ళు విడుచుట సర్వసాధారణ మైనది. గర్వమునకు దెబ్బ తగిలినందువలన మనోవేదన బడుట సహజమైనది. గాని బైబిలులోని భక్తులు మనకు వేరే మాదిరి చూపిస్తున్నారు. వారు తమ పాపముల నిమిత్తము, తమ పాపములవల్ల యేసుకు కలిగిన శ్రమ నిమిత్తము కన్నీళ్ళు విడిచిరి. యేసుప్రభువును వెంబడించేవారు తమ పాపముల నిమిత్తము యేడ్చుచు నవ్వుదురు, దుఃఖపడుచు ఓదార్చబడుదురు.

ఇప్పటివరకు ఇతరుల రక్షణ విషయమైన కన్నీటిని గూర్చి చూచితిమి, మన స్వంత పాపముల విషయమైన కన్నీటిని గూర్చి చూచితిమి. ఇప్పుడు ముగించుచుండగా మరియొక రకమైన కన్నీటిని గూర్చి చూచెదము. భక్తిపరుడైన యోహాను వృద్ధుడై తన దర్శనమునందు పరలోక పరిస్థితులు చూడగా – “లోపటను, వెలపటను వ్రాత కలిగి యేడు ముద్రలు గట్టిగా వేసియున్న ఒక గ్రంథము సింహాసనమునందు ఆసీనుడై యుండువాని కుడిచేత చూచితిని. మరియు దాని ముద్రలు తీసి ఆ గ్రంథము విప్పుటకు యోగ్యుడైనవాడెవడని బలిష్ఠుడైన యొక దేవదూత బిగ్గరగా ప్రచురింపగా చూచితిని. అయితే పరలోకమందుగాని భూమిమీదగాని భూమిక్రిందగాని ఆ గ్రంథము విప్పుట కైనను చూచుటకైనను యెవనికిని శక్తి లేకపోయెను. ఆ గ్రంథము విప్పుటకైనను చూచుటకైనను యోగ్యుడెవడును కనబడనందున నేను బహుగా యేడ్చితిని” అని మనకు తెలుపుచున్నాడు. దీనినిబట్టి చూస్తే దేవుని వాక్యము విప్పి దాని అర్థము చెప్పుటకు యోగ్యుడు దొరుకక పోయినందున యీ భక్తిపరుడు యేడ్చెను. మన కాలములో దేవుని వాక్యము విప్పి పల్లెటూర్లలోను, పెద్ద పట్టణాలలోను, చిన్న చిన్న సంఘములలోను, పెద్ద పెద్ద సంఘములలోను దేవుని వాక్యము యొక్క అర్థము చెప్పుటకు యోగ్యులు లేకపోవుచున్నందు వలన మీరెంత కన్నీళ్ళు విడిచితిరి? తల్లి దండ్రులు యేలాటి పిల్లలను సెమినెరికి పంపుచున్నారు? తల్లిదండ్రులు దేవుని సేవ కొరకు యెటువంటి పిల్లలను సమర్పించుచున్నారు? ప్రభుత్వ ఉద్యోగములకు వారు యెటువంటి పిల్లలను పంపుచున్నారు? యౌవనస్థులు తమ తమ ఉద్యోగముల విష యము తీర్మానము చేసికొనినప్పుడు దేని విషయము ఆలోచించెదరు? భక్తిపరుడైన యోహాను దేని విషయమై ఏడ్చెను? ఆయనకు దర్శనము ప్రత్యక్షమైనప్పుడు ఆయన ఆత్మ లంకలో ఖైదీగా బంధింపబడి రొట్టె, నీళ్ళతో జీవించుచుండెను. గాని విడుదల కేడ్చినట్టు లేదు. సుఖము కొరకేడ్చినట్టు లేదు. అన్నానికీ, వస్త్రానికీ ఏడ్చినట్టు లేదు.

www.doctorpaul.org
అయితే దేవుని వాక్యము విప్పి దాని అర్థము చెప్పుటకు యోగ్యుడు కావలెనని ఏడ్చెను. ప్రస్తుత కాలమందు మన సంఘములో అలాంటి యోగ్యులున్నారా? అలాంటి యోగ్యులైన యౌవనస్థులు దైవసేవచేయుటకుగాను సెమినెరిలో తర్ఫీతు పొందుతున్నారా? ప్రస్తుత కాలమందు దేవుడు అనేకమంది యువకులను క్రీస్తు సేవ కొరకై పిలుచుచున్నాడు. అయితే వారు దేవుని పిలుపునకు "వస్తాము" అని చెప్పుటకు బదులు "రాము" అని చెప్పుచున్నారు. ప్రస్తుతమున్న యెక్కువ అవసరతనుబట్టి చూస్తే ప్రతి సెమినెరికి తర్ఫీతు కొరకై వచ్చుచున్న కొంతమంది యువకులను మాత్రము దేవుడు జీవిత పర్యంతము సంపూర్ణమైన సేవ చేయుటకై పిలుచుచున్నాడనుట మనము నమ్మలేము. బహుశః దేవుడు పిలిచిన వారిలో నీవొకడవై యున్నావు. లేక నీ పిల్లలలో ఒకడుండ వచ్చును. నీవు లేక నీ పిల్లలు సమ్మతి చూపుటలో ఆలస్యము చేసైనను, లేక "కాదు" అనియైనను చెప్పియుండవచ్చును. నీవు దయచేసి యీ ప్రశ్నను తిరిగి క్రొత్తదిగ నాలోచింపుము. దేవుని పిలుపుకు మనము విముఖత చూపినప్పుడు మన బాధ్యత భయంకరముగా నుండును, గాని దేవుని పిలుపునకు లోబడి క్రీస్తు సేవ చేసి నీవు "భళా, నమ్మకమైన మంచివాడవు!" అని ఆయన మెప్పు అంత్యదినములలో పొంద గలిగితే అది అన్నిటికంటె విలువగల బహుమానము. దేవుని వాక్యము విప్పి దాని యర్థము చెప్పుటకు చాలినంత యోగ్యులు దొరుకునంత వరకు మన మందరము సాగిలపడి ఏడ్చుచుందుముగాక!

ఒక రోజు వచ్చుచున్నది. ఆ రోజునందు మన కన్నుల నుండి దేవుడు ప్రతి కన్నీటిని తుడిచివేయును. ఏలయనగా "సింహాసన మధ్య మందుండు గొఱ్ఱెపిల్ల వారికి కాపరియై, జీవజలముల బుగ్గల యొద్దకు వారిని నడిపించును, దేవుడే వారి కన్నులనుండి ప్రతి బాష్పబిందువును తుడిచి వేయును" (ప్రకటన 7:17). "కనికరము చూపు తండ్రి, సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడు, మన ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియు నైన దేవుడు స్తుతింపబడునుగాక!" (2 కొరింథీ. 1:3). "ఆయన వారి కన్నుల ప్రతి బిందువును తుడిచివేయును, మరణము ఇక నుండదు, దుఃఖమైనను ఏడ్పైనను వేదన యైనను ఇక నుండదు" అను వాక్యము యేసుక్రీస్తు క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని స్థాపించుటకు దిగి వచ్చినప్పుడు నెరవేరును. కాబట్టి వ్యసనాక్రాంతుడైన యేసుప్రభువును వెంబడించుచు ఆ కన్నీళ్ళులేని మోక్షములో మనమందరము చేరుదుముగాక!

ఒకడు ఎందుకొరకు కన్నీరు విడుచుచు వ్యసనాక్రాంతుడైనాడో మనము గ్రహించి నప్పుడు ఆయన ఎటువంటివాడై యున్నాడో తెలిసికొన వచ్చును. మీరెందుకు కన్నీరు విడుస్తారు. నేనెందుకు కన్నీరు విడుస్తాను? నలుబది ఏండ్లు అరణ్యములలో అల్లాడుచు తిరుగుచుండిన ఇశ్రాయేలీయుల స్థితి యోచింతము. వారు ఎల్లప్పుడు విసుకుచెందుచు

www.doctorpaul.org
యుండినారు. వారికి కలిగిన కష్టముల వలనను, వారికి స్వదేశము లేనందు వలనను, తగిన భోజనము లేనందువలనను, వారి మార్గము చాల కష్టములతో నున్నందువలనను, ఎండలు ఎక్కువగా నున్నందువలనను వారు అల్లాడుచూ వచ్చిరి. ఇరువై లక్షలమంది ఇశ్రాయేలీయులు తమ డేరాల వాకిట నిలబడి తలలు కొట్టుకొంటు ఏడుస్తూ ఉండుట చూడగా మనకేమి తోస్తుంది? వారికెందుకు ఇక్కట్టులు వచ్చినవో దాని విషయమై యోచించ లేదు. ఇక్కట్టులకు కారణమైన తమ పాపములనుగూర్చి ఏడ్వ లేదు, సంఖ్యా కాండము యొక్క మూల మాట ఏడ్చుట అనునది: (11:1,3; 11:4,6; 13:33-14:2; 16:3; 16:41; 20:2-5; 21:4 సరిపోల్చుము). వారికి కలిగిన కష్టాలు మోషేకు కూడ కలుగలేదా? కలిగినవి గాని ఆయన ఆ కష్టములను గూర్చి ఏడ్వకుండ తన ప్రజల రక్షణ నిమిత్తము ఆయన ఏడ్చినాడు. వారు తినిన భోజనము ఆయన తినలేదా? వారనుభవించిన ఎండ, గాలి ఆయన అనుభవించలేదా? మనము ఏలాటివారము కావలెను? ఇశ్రాయేలీయుల వంటివారము కావలెనా? మోషే వంటివారము కావలెనా? మన కష్టముల వలన మన గర్వభంగముల వలన మనము కోరిన వస్తువులు దొరుకక పోవడము వలన ఏడుస్తామా? లేక గొప్ప గొప్ప దైవసేవకులు చూపించిన మాదిరి అనుసరిస్తామా?

సామాన్య జీవితములో ఏడ్చుట, కన్నీరు విడుచుట మామూలై యున్నది. కష్టాలు లేనివారు గాని కన్నీరు విడచుటకు కారణములు లేనివారు గాని ఎవరును లేరు. అయితే మనము సాధారణముగా దుఃఖపడే విషయములకు ఉత్తమమైన జీవితములో జీవించిన దైవజనులు దుఃఖపడిన విషయములకు ఎంతో భేదమున్నది. ప్రజల రక్షణ నిమిత్తమును, మన స్వంత పాపముల నిమిత్తమును, దేవుని వాక్యము విప్పి అర్థము చెప్పుటకు యోగ్యులు దొరకు నిమిత్తమును, మనము వారివలె వ్యసనాక్రాంతులమై యుందుముగాక! వ్యసనాక్రాంతుడైన యేసు అడుగులలో నడుచుచు ఆయన సంతోష ములోకి ప్రవేశించుదుముగాక! మనము ఎంత లోతుగా దుఃఖపడుదుమో అంత ఎక్కువగా తర్వాత సంతోషించెదము. కన్నీళ్ళు విడుచుచు విత్తువారు సంతోషగానముతో పంటకోసెదరు. విత్తువాడు పిడికెడు విత్తనములు చేతపట్టుకొని ఏడ్చుచుపోవును, అయితే అతడు సంతోషగానము చేయుచు పనలు మోసికొని వచ్చును" (కీర్తన 126:5,6). చెరనుండి ఇశ్రాయేలీయులు నడిపింపబడి తమ స్వదేశమునకు తిరిగి వచ్చినప్పుడు 126 వ కీర్తన వ్రాయబడి యున్నది. ఆ పరిస్థితిలో ఒకడు తన యింటిలో నున్న కొన్ని బస్తాల ధాన్యమును తన యింటిలో తనపై ఆధారపడియున్న భార్య పిల్లలను చూచి ఆలోచించి లెక్కపెట్టి ఆ ధాన్యము మరల పంటకు వచ్చువరకు చాలదని కన్నీళ్ళు విడిచినట్లు వ్రాయబడియున్నది. వారు బబులోను చెరలోనుండి విడుదల పొంది తమ

www.doctorpaul.org
స్వదేశమునకు రాగా కల కనినవారివలె నుండిరి. వారి నోటినిండ నవ్వుండెను. వారి నాలుక ఆనంద గానముతో నిండియున్నది (కీర్తనలు 126:1-2). చేరిన వెంటనే ధాన్యము చాలదని గ్రహించి యేడ్చిరి. తమకు చాలనటువంటి ఈ కొద్ది ధాన్యమునుండి కావలసిన విత్తనములకై కొంత తీసికొని పోయి పొలములో చల్లనారంభించి వారు కన్నీళ్ళు విడిచిరి. వారు చల్లుచున్న ప్రతి గింజయు తమకు తమవారి కడుపుకు అత్యవసరమై యున్నది. అట్టి పరిస్థితిలో 126వ కీర్తన వ్రాయబడినది. కన్నీళ్ళతో విత్తనములు చల్లకపోయియుంటే వారికి ముందు పంట పండకనే యుండదు. వారు కన్నీళ్ళు విడుచుచు విత్తనములు చల్లినందువలన ముందు పంటకు సంతోషముతో యెదురు చూడగల్గినారు. వారు చల్లిన విత్తనములు చాల విలువ గలవి గాని, ఆత్మీయముగా మనము యీ రోజులలో చల్లుచున్న విత్తనములు మరెక్కువ విలువ గలవి కావా?

వ్యసనాక్రాంతుడైన యేసుని అడుగులలో మనము నడుచుచుండగా ఇతరుల రక్షణ నిమిత్తమును మన స్వంత పాపముల నిమిత్తమును, యోగ్యులైన దైవ సేవకులు దొరుకు నిమిత్తమును కన్నీళ్ళు విడుచుచు నుందుము గాక! "దుఃఖపడిన వారమైనట్లుండియు ఎల్లప్పుడు సంతోషించువార"మగుదుము గాక! (2 కొరింథీ 6:10).